మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## పిల్లలకు పౌష్టికాహారం అందించండి



3లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 76 | ఆదివారం | 24 - 08 - 2025 | పేజీలు: 8 | వెల: 4



### భారత్ నుంచి అమెరికాకు పోస్టల్

## సేవలు నిలిపివేత

- ఆగస్టు 25 నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానున్నట్లు ప్రకటన
- అమెరికా కొత్త కస్టమ్స్ నిబంధనలే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం

మన గళం, న్యూఢిల్లీ : భారత్ నుంచి అమెరికాకు పార్శిళ్లు, ఇతర వస్తువులు పోస్టల్ శాఖ ద్వారా పంపే వారికి ఇది ముఖ్య గమనిక. అమెరికా ప్రభుత్వం విధించిన కొత్త కస్టమ్స్ నిబంధనల కారణంగా, ఆగస్టు 25 నుంచి ఆ దేశానికి పలు పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు

2 లో..

### అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే

## ఈ దుస్థితికి కారణం

- టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు
- 14 నెలల్లోనే రూ.1.86 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఆదాయం తగ్గిపోయి అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. కాగ్ లెక్కల ఆధారంగా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరిస్తూ, టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం 14 నెలల కాలంలోనే రూ. 1,86, 361 కోట్ల అప్పు చేసిందని జగన్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో ఇది 56 శాతానికి సమానమని ఆయన పోల్చి చెప్పారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని, అప్పులను తగ్గిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి, ఇప్పుడు అందుకు విరుద్ధంగా

2 లో..



## నిజంగా యూరియా కొరతనా..

### - నేతలు సృష్టిస్తున్న కృత్రిమ కొరతనా..

మన గళం, విజయవాడ : ఏపీలో రైతుల యూరియా కష్టాలు వర్ణనాతీతమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏ రైతుని కదిలించినా ఎరువుల కోసం కన్నీటివ్యథ.. తెల్లవారు జామునుంచే ఎరువుల కేంద్రాల దగ్గర కిలోమీటర్ క్యూలు.. కట్ట యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూపులు.. ఇదేనా కూటమి ప్రభుత్వానికి రైతాంగం మీదున్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. ఎరువుల కోసం రైతులను అరిగోస పెట్టడమా రైతు పక్షపాతి అంటే అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బీజేపీకి మద్దతు ఇచ్చిన రాష్ట్రంలో రైతు సేవా, మార్క్ ఫెడ్ , సొసైటీ కేంద్రాల దగ్గర యూరియా నో స్టాక్ బోర్డ్ లు పెట్టడానికి సిగ్గుండాలని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానిది సాగుకు పెద్దపీట కాదు రైతు

2 లో..

### అంతరిక్ష రంగంలో 'ప్రైవేట్'కు

## ప్రధాని భారీ టార్గెట్



- రాబోయే ఐదేళ్లలో 5 యూనికార్న్‌లు సృష్టించాలని పిలుపు
- ప్రస్తుతం ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాలను ఏటా 50కి పెంచాలని సూచన

మన గళం, న్యూఢిల్లీ : భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాలని, రాబోయే ఐదేళ్లలో కనీసం ఐదు యూనికార్న్‌లను సృష్టించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏడాదికి ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాల సంఖ్యను 50కి పెంచే దిశగా కృషి చేయాలని

2 లో..




## 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మొహంలో

# ఆనందం చూడాలి

- సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారు
- వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారు
- గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు
- సీఎం చంద్రబాబు నాయుడు

మన గళం, పెద్దాపురం : కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. చంద్రబాబు తాజాగా పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సీఎంకు స్థానిక నాయుకులు, ప్రజలు అఖండ స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మొహంలో ఆనందం చూడాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంట్లో చెత్త బయట పడేయటం వలన అంటూ వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ రెండో తేదీలోపు 85టన్నుల చెత్తను సేకరిస్తాం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి మొహంలో ఆనందం చూడాలి' అని

2 లో..





### 2035 నాటికి ఇండియాకు

## సొంత స్పేస్ స్టేషన్

మన గళం, న్యూఢిల్లీ : న్యూఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ ప్రసంగిస్తూ.. భారత అంతరిక్ష సంస్థ భవిష్యత్తులో చేపట్ట నున్న మిషన్లకు సంబంధించిన రోడ్‌మ్యా

2 లో..

### కిడ్నీ రాకెట్ కేసులో

## విశాఖ వైద్యుడు

- విశాఖ వైద్య వర్గాల్లో ప్రస్తుతం జోరుగా చర్చ
- సీఐడీ అదుపులో డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడు



మన గళం, విశాఖపట్నం : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హైదరాబాద్ (సరూర్‌నగర్) కిడ్నీ రాకెట్ వ్యవహారంలో

## సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత



మన గళం, అమరావతి : కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) ఇకలేరు. తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. వయోభారానికి తోడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. హైదరాబాద్‌లో మణికొండలో నివసిస్తున్న ఆయనకు భార్య డాక్టర్ బీవీ విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా సురవరం సుధాకర్‌రెడ్డి ఎదిగారు. మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తెలుగు నేతగా నిలిచారు. ఆయన కంటే ముందు చంద్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. సురవరం ప్రతాప రెడ్డి ఆయన పెద నాన్న. సురవరం సుధాకర్‌రెడ్డి

2 లో..

### సైబర్ నేరగాళ్ల ఉచ్చులో

## మంత్రి నారాయణ అల్లుడు

### - మంత్రి నారాయణ అల్లుడు పునీత్‌ను లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు



మన గళం డెస్క్ : ఏపీ మంత్రి నారాయణ అల్లుడు పునీత్ కంపెనీని లక్ష్యంగా చేసుకుని, ఏకంగా రూ. 1.40 కోట్లు కాజేసిన కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, మంత్రి నారాయణ అల్లుడు పునీత్ పేరుతో ఆయన కంపెనీ అకౌంటెంట్‌కు సైబర్ నేరగాళ్లు ఓ సందేశం

2 లో..

## భారత్ నుంచి అమెరికాకు
# పోస్టల్ సేవలు నిలిపివేత

భారత తపాలా శాఖ శనివారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉత్తరాలు, కొన్ని బహుమతులు మినహా మిగిలిన అన్ని రకాల వస్తువుల బుకింగ్‌లు నిలిచిపోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జులై 30న జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ (నెం. 14324) వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఈ కొత్త ఆదేశాల ప్రకారం, ఇప్పటివరకు 800 డాలర్ల వరకు ఉన్న వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపును రద్దు చేశారు. ఆగస్టు 29 నుంచి అమెరికాకు పంపే ప్రతి వస్తువుపై, దాని విలువతో సంబంధం లేకుండా కొత్త టారిఫ్ విధానం కింద కస్టమ్స్ సుంకం విధిస్తారు. అయితే, ఈ నిబంధనల నుంచి కొన్నింటికి మినహాయింపు ఇచ్చారు. ముఖ్యంగా ఉత్తరాలు, డాక్యుమెంట్లు, అలాగే 100 డాలర్ల లోపు విలువైన బహుమతి వస్తువుల (గిఫ్ట్స్) పంపకాలపై ఎలాంటి ఆంక్షలు ఉండవని తపాలా శాఖ స్పష్టం చేసింది. తదుపరి స్పష్టత వచ్చేవరకు ఈ సేవలు యథావిధిగా కొనసాగుతాయి.

**– అసలు సమస్య ఎక్కడొచ్చింది?**

కొత్త నిబంధనల ప్రకారం కస్టమ్స్ డ్యూటీని ఎలా వసూలు చేయాలి, ఎవరు వసూలు చేయాలనే దానిపై అమెరికా నుంచి ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ఈ గందరగోళం కారణంగా, ఆగస్టు 25 తర్వాత భారత్ నుంచి వచ్చే పోస్టల్ సరుకులను స్వీకరించలేమని ఎయిర్ క్యారియర్లు తేల్చిచెప్పాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికే నిలిపివేసిన కేటగిరీల కింద వస్తువులను బుక్ చేసుకున్న వినియోగదారులు పోస్టేజీ రీఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ తాత్కాలిక అంతరాయానికి చింతిస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చిస్తూ వీలైనంత త్వరగా పూర్తిస్థాయి సేవలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని తపాలా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# అంతరిక్ష రంగంలో 'ప్రైవేట్'కు ప్రధాని మోదీ భారీ టార్గెట్



ఆయన సూచించా రు. శనివారం 'జాతీయ అంతరిక్ష దినోత్సవం' సందర్భంగా ప్రధాని వర్చువల్ విధానంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

గత 11 ఏళ్లలో అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాలను ప్రధాని కొనియాడారు. "భారత అంతరిక్ష ప్రయాణం మన శాస్త్రవేత్తల ప్రతిభ, నూతన ఆవిష్కరణలకు నిదర్శనం" అని ఆయన అన్నారు. ఒకప్పుడు నిబంధనలతో వెనుకబడిన అంతరిక్ష రంగానికి తమ ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం కల్పించడం ఒక వరంగా మారిందని, ఇది వరుస విజయాలకు కారణమైందని మోదీ వివరించారు. ప్రభుత్వ సంస్కరణల ఫలితంగానే ఈ రంగంలో 350కి పైగా స్టార్టప్‌లు వచ్చాయని తెలిపారు. అంతరిక్ష సాంకేతికత ఇప్పుడు ప్రభుత్వ పరిపాలనలోనూ భాగమైందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "పంటల బీమా పథకాల కోసం శాటిలైట్ ఆధారిత అంచనాలు, మత్స్యకారులకు ఉపగ్రహాల ద్వారా సమాచారం, విపత్తుల నిర్వహణ, పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో జియోస్పేషియల్ డేటా వాడకం వంటివి సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేస్తున్నాయి" అని ఆయన వివరించారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, శాస్త్రవేత్తల కృషితో త్వరలోనే భారత్ 'గగన్‌యాన్' మిషన్‌ను ప్రయోగిస్తుందని, రాబోయే కాలంలో మన దేశం సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని (స్పేస్ స్టేషన్) కూడా నిర్మిస్తుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో నూతన తరం సంస్కరణలను కొనసాగించేందుకు ప్రభుత్వానికి సంకల్పం ఉందని చెబుతూ, యువతకు అపార అవకాశాలు కల్పించే ఈ రంగం వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రైవేట్ సంస్థలను ప్రధాని ఆహ్వానించారు.

# నిజంగా యూరియా కొరతనా..

మెడమీద కత్తిపీట పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్ర కోటా మేరకు యూరియా వస్తే మరి ఆ ఎరువులు ఏమైనట్లు అని ప్రశ్నించారు. 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటే రైతులకు ఎరువు కరువు ఎందుకు అని నిలదీశారు. రైతులకు చేరాల్సిన యూరియా ఏ దారి మళ్లింది? ఎవరి గోడౌన్లకు అక్రమంగా యూరియా తరలుతోంది ? అక్రమ రవాణాపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ నిద్ర పోతుందా ? అని ప్రశ్నించారు. 266 రూపాయలు అమ్మాల్సిన బస్తా ధర బహిరంగ మార్కెట్ లో 500 రూపాయలకు ఎందుకు అమ్ముతున్నారు అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఇది నిజంగా కొరతనా.. లేక అధికార పార్టీ నేతలు సృష్టిస్తున్న కృత్రిమ కొరతనా ? అని నిలదీశారు. దీనికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. వెంటనే యూరియా బ్లాక్ మార్కెట్ దందా అరికట్టాలని.. విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలని.. ప్రైవేట్ వ్యాపారులపై తక్షణ తనిఖీలు నిర్వహించాలని కోరారు. యూరియాను బ్లాక్ చేసిన వాళ్ల పై యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో అదనంగా అవసరం పడిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియాను వెంటనే సొసైటీల ద్వారా సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలన్నారు.





# 2035 నాటికి ఇండియాకు సొంత స్పేస్ స్టేషన్

ప్‌ను ప్రకటించారు. ఈ ప్లాన్ ప్రకారం 2035 నాటికి భారతదేశానికి సొంత అంతరిక్ష కేంద్రం, భారతీయ అంతరిక్ష స్టేషన్ ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా 2028 నాటికి మొదటి మాడ్యూల్‌ను ప్రారంభించే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, నెక్స్ట్ జనరేషన్ లాంచర్‌కు ప్రధాని మోదీ ఆమోదం తెలిపారని.. 2040 నాటికి భారతదేశం చంద్రునిపై అడుగుపెడుతుందని ఆయన అన్నారు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుడిపై వ్యోమగామిని దించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 2040 నాటికి ప్రపంచంలోని ఇతర దేశాలతో సమానంగా భారత్ స్పేస్ టెక్నాలజీలో అభివృద్ధి సాధిస్తుందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర దిశానిర్దేశం, దార్శనికతతో ఇస్రో చంద్రయాన్-4 మిషన్‌తో పాటు వీనస్ ఆర్బిటర్ మిషన్‌ను చేపట్టిందని వెల్లడించారు.

2035 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్, 2040 నాటికి, చంద్రునిపై భారత వ్యోమగామిని దింపడమే లక్ష్యంగా ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా, ప్రధాని మోదీ, తొలిసారిపై అడుగుపెట్టిన భారతీయుడిగా రికార్డు సృష్టించిన శుభాంశు శుక్లాను ఇస్రో ఛైర్మన్ ప్రశంసలతో ముంచెత్తారు. 2040 నాటికి మన దేశపు వ్యోమగామిని చంద్రునిపై పర్యటింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇస్రో ఛైర్మన్ తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో గగన్‌యాన్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలవనుందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా భారత వైమానిక దళానికి చెందిన నలుగురు టెస్ట్ పైలట్లను వ్యోమగాములుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు బెంగళూరులోని శిక్షణ కేంద్రంలో ప్రత్యేకంగా ట్రైనింగ్ పొందుతున్నారని వెల్లడించారు. తొలిసారిగా



భారత వ్యోమగాములు భూమికి దగ్గర కక్ష్యలో ప్రయాణించి, మూడు రోజుల తర్వాత భూమిపైకి తిరిగి వస్తారని చెప్పారు. ఇక రానున్న కాలంలో శుక్రగ్రహ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపించడంపైనా, అంగారకుడిపై ల్యాండర్‌ను దించేందుకు చర్యలు ప్రారంభించినట్టు చెప్పారు.

# అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణం

వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఇంత భారీగా అప్పులు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటుపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడుల (పన్ను, పన్నేతర) వృద్ధి కేవలం 3.08 శాతంగానే నమోదైందని తెలిపారు. దేశ జీడీపీ వృద్ధి 9.8 శాతంగా, కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04 శాతంగా ఉన్నప్పుడు, రాష్ట్ర ఆదాయ వృద్ధి ఇంత తక్కువగా ఉండటం ఆర్థిక మందగమనానికి సూచిక అని ఆయన



అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 12.02 శాతం వృద్ధి చెందుతోందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఈ లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి నాలుగు నెలల్లో కూడా పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని జగన్ విమర్శించారు. వినియోగానికి సూచికలైన జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే తగ్గాయని ఆయన వివరించారు. రాబడులు పడిపోవడం, అప్పులు ఖగోళ వేగంతో పెరగడం చూస్తుంటే, ప్రభుత్వం తన పాలనా విధానాలపై తీవ్రంగా పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని జగన్ హితవు పలికారు.

# 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మోహంలో ఆనందం చూడాలి

చంద్రబాబు అన్నారు. 'ఉమ్మడి జిల్లా వాసులు చాలా సౌమ్యులు. ఇలాంటి చోట కూడా గతంలో రౌడీయిజం చేశారు. మేం పెద్దాపురంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంటును ప్రారంభించబోతున్నాం. వర్షాకాలంలో దోమల వల్ల రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్రోన్స్ ఉపయోగించి రాష్ట్రంలో దోమల సమూల నివారణకు చర్యలు తీసుకుంటాం. సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు. సాధ్యం కాదు అన్నారు. సాధ్యం చేసి చూపించా. 2027లో పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమృత్ పథకంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 75 కోట్ల రూపాయలతో ఇంటింటికి మంచినీటి కుళాయి వేయిస్తాం. ఎన్డీఏకు పెద్దాపురం నియోజకవర్గం కంచుకోట. ఇక్కడ మరొకరికి అవకాశం ఇవ్వకూడద'ని చంద్రబాబు పేర్కొన్నారు.




# కిడ్నీ రాకెట్ కేసులో విశాఖ వైద్యుడు

విశాఖపట్నానికి చెందిన వైద్యుడిని సీఐడీ అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకూ 19 మందిని అరెస్టు చేసినట్టయింది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన పవన్ అనే వ్యక్తిది కూడా విశాఖపట్నమే. ఆయనను ఇప్పటికే అరెస్టు చేయగా.. శుక్రవారం నగరానికి చెందిన డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడిని సీఐడీ అదుపులోకి తీసుకుంది. సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ వ్యవహారం ఈ ఏడాది జనవరిలో వెలుగుచూసింది. కిడ్నీ ఇచ్చిన ఒకరు... ముందుగా చెప్పినట్టు డబ్బు చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు విచారణలో కళ్లు బైర్లుకమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న, నిరుపేదలను లక్ష్యంగా చేసుకుని ఒక ముఠా పెద్దఎత్తున కిడ్నీ రాకెట్‌ను నడిపినట్టు పోలీసులు గుర్తించారు. తవ్వుతున్న కొద్దీ అక్రమాలు వెలుగులోకి రావడంతో ఈ కేసును సీఐడీ (తెలంగాణ)కి అప్పగించారు. ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విశాఖకు చెందిన పవన్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరించాడు. హైదరాబాద్‌లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆస్పత్రులను గుర్తించిన పవన్ వాటిల్లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించాడు. అలకనందతోపాటు మరో ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు జరిగాయి. కిడ్నీ అవసరమైన వ్యక్తులను, వారికి కిడ్నీలు ఇచ్చేవారిని దళారులు, ఏజెంట్ల ద్వారా పవన్ గుర్తించేవాడు. ముఖ్యంగా తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల వారిని తీసుకొచ్చి వారి నుంచి కిడ్నీలు తీసుకునేవాడు. అందుకు వారికి రూ.5 లక్షలు, ఆస్పత్రికి, వైద్యులకు మరో రూ.15 లక్షలు చెల్లించేవాడు. కొంత మొత్తం దళారులకు ఇచ్చేవాడు. పవన్‌కు సుమారు రూ.25 లక్షల వరకూ మిగిలేది. ఇలా పదుల సంఖ్యలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు సీఐడీ గుర్తించింది.

# సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత

సొంతూరు జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు. ఆయన తన అమ్మమ్మ ఊరు కోడేరు మండలం కొండ్రావుపల్లిలో 1942 మార్చి 25న జన్మించారు. విద్యాభ్యాసం కోసం కర్నూలు వెళ్లారు. 15 సంవత్సరాల వయసులోనే తమ పాఠశాలకు బ్లాక్‌బోర్డులు, పుస్తకాలు కావాలంటూ జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలం సుధాకర్‌రెడ్డిని ఆకర్షించింది. తెలంగాణ ఉద్యమంలో సుధాకర్‌రెడ్డిది కీలక భూమిక పోషించారు. మొదట్లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు తెలిపిన సీపీఐ తర్వాత ప్రత్యేక ప్యాకేజీతో తెలంగాణ వెనుకబాటుతనాన్ని తీర్చవచ్చని భావించింది. అయితే ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం తప్ప వేరే మార్గం లేదని గుర్తించి పార్టీ వైఖరిని మార్చుకుంది. ఈ నిర్ణయం మారడంలో ఆయన ప్రధానపాత్ర వహించారు.

గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలించనున్నారు. కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం మూడు గంటల వరకు అక్కడే ఉంచనున్నారు. ఆ తర్వాత పార్థివదేహాన్ని గాంధీ ఆసుపత్రికి, సురవరం నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి కుటుంబ సభ్యులు అందజేయనున్నారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆయన మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మంత్రి నారాయణ అల్లుడు

పంపారు. అత్యవసరంగా డబ్బు అవసరమని, వెంటనే తాను చెప్పిన బ్యాంకు ఖాతాకు రూ. 1.40 కోట్లు బదిలీ చేయాలని ఆ మెసేజ్‌లో సూచించారు. ఆ సందేశం నిజంగా పునీత్ నుంచే వచ్చిందని భావించిన అకౌంటెంట్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు చెప్పిన ఖాతాకు డబ్బును బదిలీ చేశారు. అయితే, కొద్దిసేపటి తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించిన అకౌంటెంట్, వెంటనే పోలీసులను ఆశ్రయించారు. అకౌంటెంట్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల జాడను కనిపెట్టారు. ఈ మోసానికి పాల్పడింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజీవ్, అరవింద్ అనే ఇద్దరు వ్యక్తులుగా గుర్తించి, వారిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆదివారం
24 - 08 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## సురవరం మృతికి సంతాపం తెలిపిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు : సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సంతాపం తెలిపారు. సురవరం మృతి బాధాకరమని, ఒక్క గొప్ప నాయకుడిని కోల్పోయామని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి సంఘం నాయకుడి నుంచి రాజకీయ పార్టీ అగ్రనేతగా ఎదిగారని కొనియాడారు. అనేక ప్రజా పోరాటాలు చేసిన ఆయన దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారాన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారం అందించండి



**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, గూడూరు : పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అంగన్వాడి సిబ్బందిని ఆదేశించారు. శనివారం గూడూరు మండలం నాగలాపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు. ప్రతి రోజు పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. గుడ్లు వాసన వస్తుండడంతో,. చెడిపోయిన వాటిని తిరిగి పంపించకుండా ఎందుకు ఉంచుకున్నారని ప్రశ్నించారు. అనంతరం కిచెన్ ను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సర్పంచ్ నాయోమి, ఎంపిడిఓ మధులత, తహసిల్దార్ వెంకటేష్ నాయక్, అంగన్వాడి సూపర్వైజర్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

## 25న కర్నూలు నగరపాలక సర్వసభ్య సమావేశం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ఈ నెల 2న నిర్వహించాల్సిన నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం అనివార్యకారణాల మూలంగా జరగలేదని కమిషనర్ పి.విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశం ఈ నెల 25 (సోమవారం) ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సమావేశం జరుగుతుందన్నారు. గత సమావేశంలో ప్రతిపాదించిన అంశాలపై పాలకవర్గం ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

## వేగవంతంగా ఇళ్లను నిర్మించుకునేలా చేతన్య పరచండి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మనగళం, గూడూరు: వేగవంతంగా ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపిడిఓ, హౌసింగ్ ఏఈ లను ఆదేశించారు. శనివారం గూడూరు మండలం నాగలాపురం గ్రామంలో ఉన్న హౌసింగ్ లే ఔట్ ను పరిశీలించి, లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు జయలక్ష్మి, శివయ్యతో కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ళు వేగంగా నిర్మించుకోవాలని, అవసరం ఐతే బ్యాంక్ లతో మాట్లాడి రుణాలు ఇప్పించే విధంగా కూడా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణాల పనులలో పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హౌసింగ్ ఇంజనీర్, ఎంపిడిఓ లను ఆదేశించారు. లే ఔట్ లో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ పథకం కింద రోడ్లు వేయించే విధంగా ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీర్ ను ఆదేశించారు. అక్కడే ఇళ్ళ నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుల ఇళ్ల కు వెళ్లి వారితో మాట్లాడారు.. ఇళ్ళు నిర్మాణం పూర్తి చేసుకున్నందుకు కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి, హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సర్పంచ్ నాయోమి, ఎంపిడిఓ మధులత, తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేద రోగుల మేలుకోరే ముఖ్యమంత్రి... చంద్రబాబు

**– సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన బైరెడ్డి రాజశేఖరరెడ్డి**



మనగళం, కర్నూలు సిటీ : పేద రోగుల మేలుకోరే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసులను పరిగణమూలోకి తీసుకొని వెంటనే సీఎం సహాయ నిధి మంజూరు చేస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అందజేశారు. పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డికి రూ.1,56,652 , నెహ్రూనగర్ కు చెందిన యం. చిన్న లక్ష్మీదేవికి రూ. 75 వేలు, నందికొట్కూరుకు చెందిన మొల్ల మైమున్నిసాకు రూ. 70 వేలు, ఆళ్లగడ్డ నియోజకవర్గం కోటకందుకూరుకు చెందిన ఎన్. మహ్మద్ గౌస్ కు రూ. 67,461, ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన గాండ్ల నాగ శేషయ్యకు రూ. 1,62,736, నంద్యాలకు చెందిన జి. విజయగౌరి భాయ్ కి రూ. 60,400, శ్రీశైలం నియోజకవర్గం వెలుగోడు మండలం అబ్దుల్లాపురానికి చెందిన ఈ. సాయి క్రిస్టమ్మ కు రూ. 58 వేలు, పాణ్యం నియోజక వర్గం గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన తెలుగు పెద్ద ఎల్ల నాగరాజుకు రూ.50,900 చొప్పున చెక్కులను బైరెడ్డి అందజేశారు. సీఎం సహాయ నిధిని మాకు వచ్చేలా కృషి చేసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రిటీష్ తుపాకి గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన ఆంధ్రకేసరి

మనగళం, కర్నూలు సిటీ : స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారి తుపాకీ గుళ్ళకు ఎదురు నిలిచి వారికి ముచ్చెమటలు పట్టించిన ధీరుడు మన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని మాజీ ఎమ్మెల్సీ సుధాకర బాబు గారు, ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153 వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రకేసరి త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిడాల అమన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, ఐఎన్టీయూసీజిల్లా అధ్యక్షులు బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, నాయకులు సత్యరాజు, సుబ్రహ్మణ్యం,షేక్ మాలిక్ భాషా, కేశవరెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.





## ఎస్సీ వర్గీకరణ... దళితుల ఐక్యతపై రాజకీయ కుట్ర!




మనగళం, కర్నూలు సిటీ : ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై ప్రధాని మోడీ కుట్ర చేస్తున్నారని రాక్స్ అండ్ మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. ఈ కుట్రలో ప్రధాన భాగస్వామి చంద్రబాబు నాయుడు అన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మొదట పంజాబ్లో1975 లో కాంగ్రెస్ పార్టీ బీజం వేస్తే, ఈరోజు మోడీ దేశం మొత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ పేరుతో, మనకి పడేసేది ఎంగిలి వెతుకులే అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వల్ల సుమారుగా లబ్ధి పొందేది నలుగురు మాత్రమే వందలో అని ఈ రిజర్వేషన్ ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎస్సీ లిస్టులో ఉన్న 59 ఎస్సీ కులాలకు ఎలా సమంగా పంచుతారు... అలాగే మోడీ దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా సమంగా పంచుతారని ప్రశ్నించారు. ఈ దేశంలో ఉన్న సంపద విషయంలో వర్గీకరణ అక్కర్లేదా అని నిలదీశారు. అలాగే భూములు, మోడీ,చంద్రబాబు క్యాబినెట్లో మంత్రి పదవులు, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు నియామకాల్లో, ఇండస్ట్రీస్ లో వర్గీకరణ అక్కర్లేదా? అని ధ్వజమెత్తారు. కేవలం ఎస్సీలకు పడేసే ఎంగిలిమితికిల్లో నేనా వర్గీకరణ? అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని తొక్కేస్తా ఉంటే పెద్దలు కనీసం నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఇకనైనా మాలలంతా, మన ఉనికిని చాటేందుకు, రోడ్లపై కొచ్చి, శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేని పక్షంలో మాల సామాజిక వర్గం తెలుగు రాష్ట్రాల్లో పూర్తిగా కనుమరుగైపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాల బాలముని, మునమ్మ, ధనుష్, గోవర్ధన్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం

**– ప్రైవేటు సంస్థలకు ఎస్టీపీల నిర్వహణ – ఖేలో ఇండియా పనులకు ప్రతిపాదనలు పంపండి**
**– గ్రీన్ సిటీ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయండి – నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బలమైన పునాదులు వేసేలా అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జమ్మిచెట్టు, సంకల్‌బాగ్, ఓల్డ్ పంప్‌హౌజ్‌ల వద్ద ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలు చేపట్టాలని సూచించారు. మరో ఎస్టీపీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 5 మైదానాల్లో క్రీడా సౌకర్యాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీలో భాగంగా 5 పార్కులను అభివృద్ధి చేయడం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఓఆర్ఆర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడ నగరపాలక సంస్థకు చెందిన 135 ఎకరాల భూమిని సర్వే చేసి, రక్షణ వలయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. మాధవి నగర్ సమీపంలో తాగునీటి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి, మామిదాలపాడులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజ్, నరేష్, గంగాధర్, క్రిష్ణలత, ఏఈలు ప్రవీణ్ కుమార్, వైష్ణవి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సూపరింటెండెంట్ మంజూర్ డీఫీ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూల్ ప్రెస్ క్లబ్ సభ్యత్వం తీసుకోండి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూల్ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం నమోదు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని పాత్రికేయ మిత్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కర్నూల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. శనివారం ఆయన ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ చాలామంది పాత్రికేయ మిత్రులు సభ్యత్వం నమోదు కార్యక్రమం ఎప్పుడు అని అడుగుతున్నారని చెప్పారు. విలేకరుల సూచనల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నుండి చేపడుతున్నామన్నారు. ఉదయం 11:35 నుండి1.35 మధ్యాహ్నం వరకు సాగుతుందని, రూ. 500 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. మొదటగా అక్రిడేషన్ కలిగి ఉన్న పాత్రికేయ మిత్రులకు సభ్యత్వం ఉంటుందన్నారు. అన్ని మీడియా ప్రతినిధులు మండల స్థాయిలో ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు . త్వరలో పాత్రికేయులు వివిధ ప్రాంతాల నుండి కర్నూలు కేంద్రానికి వచ్చినప్పుడు బస ఉండేందుకు వసతి గృహాన్ని కూడా త్వరలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి పాత్రికేయులు సత్యం ను ఇన్చార్జిగా నియమించామని తెలిపారు.

## దేశ ప్రజల కోసం శ్రమించిన యోధుడు టంగుటూరి



మనగళం, కర్నూలు క్రైం : దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన యోధుడు దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు అని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీసుకార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమించి ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన అయిన కొనియాడారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారన్నారని గుర్తు చేశారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో ఆంధ్రకేసరిగా చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఎఆర్ డీఎస్పీ భాస్కర్ రావు , ఆర్ ఐ లు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్సైలు , తదితరులు పాల్గొన్నారు.

# 25న ఛలో కర్నూలు కలెక్టరేట్



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : విద్యారంగ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చేపట్టనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కర్నూలు నగరలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం నందు ఎస్ఎఫ్ఐ ఛలో కలెక్టరేట్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ విద్యారంగంపై కూటమి ప్రభుత్వం సవిత తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. జీ.వో నెంబర్ 77 ను వెంటనే రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ. 6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ. 3 వేలకు పెంచి మెరుగైనటువంటి వసతులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యక్షులు శ్రీనివాసులు, అమర్, నగర నాయకులు యోగి తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బిల్లుల చెల్లింపు సమస్యలపై సంప్రదించండి

మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలోని హౌసింగ్ లబ్ధిదారులకు ఏదైనా బిల్లుల చెల్లింపు విషయాలలో పరిష్కరిస్తామని ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, కర్నూలు జిల్లా కార్యాలయం ఫోన్ నెంబర్ 08518 -257481 ను సమస్యలు తెలిపితే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయపు పనిదినాలలో ఫోన్ చేయాలని సూచించారు.

# 'మెడికల్ కాలేజీలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర"

మనగళం, కర్నూలు సిటీ : "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని కర్నూల్ మెడికల్ కాలేజీ యందు శనివారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ ప్రిన్సిపాల్ డా. కె. చిట్టి నరసమ్మ ఆధ్వర్యంలో "మాన్సూన్ హైజిన్" కు అనుగుణంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. వర్షాకాలంలో విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాన్నారు. నీరు నిల్వ ఉండకూడదని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూదని చెప్పారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందిచే "మాన్సూన్ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ " చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతులు డాక్టర్ సుధా కుమారి, ప్రొఫెసర్ డాక్టర్ ఎలిజిబెత్, ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమ అధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నాగార్జున, డా.కోటేశ్వరరావు, డాక్టర్ హరీష్ , లెక్చరర్ సురేష్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ సాయిరాం, యూజీ పిజి వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛత యజ్ఞం... ఆరోగ్యమైన సమాజానికి పునాది

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర ప్రజలు స్వచ్ఛతను యజ్ఞంగా భావిస్తేనే ఆరోగ్యమైన సమాజానికి బలమైన పునాదులు పడతాయని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శనివారం డాక్టర్స్ కాలనీ పార్కులో 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రతి పౌరుడు వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, పరిసరాల పరిశుభ్రతకు అంతే ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛతలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, నగరాన్ని ఆదర్శంగా నిలిపేందుకు పౌరులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ఒక్కో అంశంపై 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. ఈ సారి 'మాన్సూన్ హైజీన్' అంశంపై అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, హైజీన్ పాటించడం, ఇళ్లలో శుభ్రత పాటించడం, వ్యాధుల నివారణ తదితర అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కమిషనర్ ఆశా వర్కర్లను ఆదేశించారు. అలాగే అక్కడ ఉన్న ప్రజలు, ఉద్యోగులచే 'స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ' చేయించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ శేషసాయి, ఎంఈ మనోహర్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సిఎంఎం భాస్కర్ రెడ్డి, ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు రఫీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**– మండపాలు ఏర్పాటుకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి – జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

మనగళం, కర్నూలు క్రైం : గణేష్ ఉత్సవాలు ప్రజలకు ఏ మాత్రం ఇబ్బంది కలుగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు, ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు గురించి జిల్లా ఎస్పీ శనివారం వివరించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహకులు ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా పోలీసుల అనుమతులు పొందాలన్నారు. విగ్రహాల వద్ద విధిగా ఒకరిని కాపాలగా ఉంచడంతో పాటు తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మండపాల వద్ద డీజే లు, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టం లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదన్నారు. వినాయక మండపాల ఏర్పాటు కొరకు ఎవరికి ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదన్నారు.

దరఖాస్తు విధానం చేయు విధానం:హెచ్ టీటీపీఎస్://జీఏఎన్ఈఎస్ హెచ్ యూటీఎస్ వి.నెట్ (గణేష్ఉత్సవ్.నెట్) వెబ్సైటులోకి వెళ్లి న్యూ అప్లికేషన్ క్లిక్ చేయాలి. మొబైల్ నంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది. దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబర్, ఈమెయిల్ అడ్రస్, చిరునామా.అసోసియేషన్/కమిటీ పేరు నమోదు చేయాలి. అదేవిధంగా గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ సబ్ డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో వస్తుందో తెలుపాల్సి ఉంటుంది. ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు. గణేష్ నిమజ్జనం తేది, సమయం, వాహన వివరాలు పొందపరచాలి. దరఖాస్తు సమర్పణ అనంతరం సంబంధిత పోలీసులు ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని జిల్లా ఎస్పీ వివరించారు.

ఎన్ఓసీ అండ్ క్యూఆర్ కోడ్ డౌన్లోడ్ చేయు విధానం: కమిటీ సభ్యులు హెచ్ టీటీపీఎస్://జీఏఎన్ఈఎస్ హెచ్ యూటీఎస్ వి.నెట్/ఏపీపీఎల్ఐసీఏటీఐఓఎన్ఎస్ టీఏటీయూఎస్ (గణేష్ ఉత్సవ్. నెట్/అప్లికేషన్ స్టేటస్)లోకి వెళ్లి మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. డౌన్లోడ్ చేసిన ఎన్ఓసీ అండ్ క్యూఆర్ కోడ్ ను ప్రింట్ తీసి, ల్యామినేషన్ చేసి మండపంలో ఉంచాలి. తనిఖీలకు వచ్చే పోలీసు అధికారులు వీటిని పరిశీలిస్తారన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన ఊరేగింపులు నిర్వహించే ప్రజలు తప్పనిసరిగా పోలీసుల సూచనలు పాటించాలన్నారు. నిమజ్జన ఊరేగింపులలో అల్లర్లు ఘర్షణలకు పాల్పడకుండా చూడాలి. ఆయా కమిటీల సభ్యులతో పూర్తి బాధ్యత అన్నారు. వర్షం వచ్చినప్పుడు విగ్రహా మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జన ఊరేగింపులో ఎటువంటి అపశ్రుతులు జరగకుండా చిన్న పిల్లలను, మహిళలను , వృద్ధులను దూరంగా ఉంచాలి. కుల, మత, రాజకీయ ఘర్షణలకు తావు లేకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేష్ ఉత్సవ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించిన ఎడల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హెచ్చరించారు.



# మట్టి వినాయకుల తయారీలో కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ

మనగళం, కర్నూలు సిటీ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కాలుష్య రహిత కర్నూలును నిర్మిద్దామన్న నినాదంతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో మట్టి వినాయకుని తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. 4వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. బంకమట్టితో బాలగణపతి, వీర గణపతి, శక్తి గణపతి మొదలైన వివిధ రూపాలలోని వినాయకులను తయారు చేసి తమ నైపుణ్యాలను చాటుకున్నారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి పాఠశాలల వ్యవస్థాపక అధ్యక్షులు యన్. కేశవరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో పండుగలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అలాంటి పండుగలలో వినాయక చవితి పండుగ కుల, మత ,జాతి వర్గాలకు అతీతంగా జరుపుకుంటారన్నారు. అలాంటి వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తమ పాఠశాలలో మట్టి వినాయకుని తయారీ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించ దగినదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.




# పరిసరాల శుభ్రత పాటించాలి

మనగళం, కర్నూలు సిటీ : ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని టీడీపీ నేత గౌరు జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చెత్త నుంచి వర్మికంపోస్ట్ తయారు చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడి వారిని సన్మానించారు.

# మహిళా జైలు తనిఖీ

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మహిళా కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలు లలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని సూచించారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని, త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీ లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు. ఖైదీలకు జైలు అధికారుల నుంచి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని మహిళా ఖైదీలను అడిగి తెలుసు కొన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ న్యాయ వాది సులోచన మరియు ఖైదీలు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ చట్టం పై అవగాహన సదస్సు

మనగళం, కర్నూలు సిటీ : బి. క్యాంపు నందు గల ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకుడు డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ అధ్యక్షతన శనివారం పీసీఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ సులోచన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందన్నారు. ఎస్సీ ,ఎస్టీల హక్కులను కాపాడడంలో ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు శాఖ,ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించడం మనందరి బాధ్యత అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ కళాశాలలో అందరూ కలిసిమెలిసి ఉండాలని, కులం పేరుతో దూషించడం చేయరాదని సూచించారు. అనంతరం గవర్నమెంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘము జిల్లా ప్రెసిడెంట్ మురళి శంకరప్ప ఎస్సీ /ఎస్టీ యాక్ట్ ఉపయోగించు కొని తమను ఎలా కాపాడు కోవాలో వివరించారు. కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, సోమేశ్, జబీన్ అక్తర్, ఉల్లోజిరావు, చిన్న మల్లేశ్వరుడు, శ్రీధర్ తదితరులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పైన అవగాహన కల్పించారు.

ఆదివారం
24 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఎన్నికల కమిషన్ విశ్వాస సంక్షోభం

ఇలా జరుగుతుందని చాలా కాలంగా అనుకుంటున్నదే. గత పక్షం రోజుల్లో వరుసగా సాగిన కల్లోల భరితమైన ఘటనలు ప్రజాస్వామ్యంపై పథకం ప్రకారం జరుగుతున్న తీవ్రదాడిని ముందుకు తెచ్చాయి. ఈదాడి అనేక స్థాయిల్లో జరుగుతున్నది. అట్టడుగున చూస్తే (ప్రజాస్వామ్యం పునాదుల పైన, ప్రాతినిధ్య ప్రభుత్వ వ్యవస్థ పైన) రాజ్యాంగ హక్కుగా వచ్చిన పౌరుల ఓటు హక్కుకే తీవ్ర ప్రమాదం. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర పరిశీలన ఎస్.ఐ.ఆర్ (సర్) రూపంలో ఎదురైంది. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల కమిషన్ (ఇ.సి.ఐ)నీ దెబ్బ తీయడం దీనికి మరో కోణం. ఆ ప్రకారం అది స్వతంత్రంగా పనిచేయడం, అందరి పట్ల ఒకేలా వ్యవహరించటం జరగాలి. ఇక మూడో దాడి అసలు జవాబుదారీతనం అన్నదాన్నే మోసపూరితంగా దెబ్బతీయడం జరుగుతున్నది. ఎస్.ఐ.ఆర్ గురించి జూన్ 24వ తేదీన ఇ.సి.ఐ చేసిన బహిరంగ ప్రకటనతోనే సార్వత్రిక వయోజన ఓటింగ్ హక్కు సూత్రంపై దాడి మొదలైంది. ఎస్.ఐ.ఆర్ కు సంబంధించిన వివిధ అంశాలను ఇప్పటికే పాఠకులతో పంచుకుంటూనే వున్నాము. కొంచెం సంతోషకరమైన విషయం ఏమంటే ప్రజాస్వామ్య, లౌకిక, ప్రతిపక్ష పార్టీలు బీహార్‌లోనూ, జాతీయంగాను కూడా ఒక్కతాటిపై నిలబడి దీని గురించి ప్రతిస్పందించడం. ఉమ్మడి ప్రతిపక్ష కార్యాచరణలో చాలాకాలం పాటు స్తబ్దత నెలకొన్న తర్వాత ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ఆ ఐక్యతకు కొత్త ఊపు తీసుకొచ్చింది. ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్ణయించిన కాలవ్యవధి చాలా అల్పంగా ఉండింది. ఎలాంటి అర్థవంతమైన, సమగ్రమైన పరిశీలనకు అది ఏ విధంగానూ సరిపోయేది కాదు. అందువల్ల దాని నిజమైన ఉద్దేశాన్ని గ్రహించటం, తగువిధంగా స్పందించటం సులభమైపోయింది. జూన్ 25నే బీహార్‌లో నిరసనలు ప్రారంభమై దేశమంతటికి విస్తరించాయంటే అదే కారణం. ఇ.సి.ఐ స్వతంత్ర పని విధానం కొడిగట్టిపోవడం అన్నది మొదటి నుంచి కనిపిస్తూనే ఉంది. ఈ విస్తార ప్రక్రియను ప్రారంభించడానికి ముందు ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను విడివిడిగాగాని, ఒక్కటిగాగాని కలుసుకునే ప్రయత్నమేది చేయలేదు. ఇది దీర్ఘకాలంగా అమలవుతున్న సంప్రదాయానికి పచ్చి ఉల్లంఘనే. ఈ మినహాయింపు ఏదో యథాలాపమైంది కాదని, పక్షపాతంతో కూడిందని భావించటం అనివార్యమైంది. ప్రతిపక్ష పార్టీలు తమ నిరసనలు ప్రత్యక్షంగా ఇ.సి.ఐ కి తెలియజేస్తుంటే కమిషన్ నిర్ణయాన్ని బలపరచడం కోసం బీజేపీ ఉబలాటపడింది.

పౌరుల దరఖాస్తు పత్రాలతో ఇ.సి.ఐ కోరిన పదకొండు పత్రాలలో ఏదైనా ఇవ్వడమనేది పేద పౌరులకు, ప్రత్యేకించి వలస కార్మి కులకు చాలా క్లిష్టమైన విషయమని అర్థమైపోయింది. ఎందుకంటే వలస కార్మికులు తరచూ జీవనోపాధి కోసం తిరుగుతూ ఉంటారు. రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఆధార్‌ను సాధారణంగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పత్రాలుగా పరిగణిస్తారు. అయితే వాటిని ఆమోదించడానికి ఇ.సి.ఐ నిరాకరించడంతో ఎస్.ఐ.ఆర్ కసరత్తు నిజంగా అర్థవంతమైన పరిశీలన కోసం కాదనీ, సామూహిక ఓట్ల తొలగింపునకు మాత్రమే ఉద్దేశించబడిందని స్పష్టంగా తెలిసిపోయింది. ఎన్నికల కమిషన్ ఏర్పడినప్పటి నుంచి ఓటరు నమోదు కోసం అనుసరిస్తున్న పద్ధతుల నుంచి మౌలికంగా వైదొలగే విధంగా ఎస్.ఐ.ఆర్ కొలబద్దలున్నాయి. ఓటు హక్కు ఎల్లప్పుడూ వయోజనులకు సార్వత్రికమైందిగా ఉండింది. యంత్రాంగమే దానికి వాస్తవ రూపం కల్పిస్తుండేది. అంతేకానీ పౌరులపై తమ పౌరసత్వం నిరూపించు కోవలసిన భారం మోపేదికాదు. దీనిపై ప్రశ్నించినప్పుడు ఎన్నికల సంఘం 326వ అధికరణను ప్రస్తావించింది. ఈ అధికరణం ప్రధాన లక్ష్యం ఓటు వేయడానికిగల సార్వత్రిక హక్కును రక్షించడమే తప్ప పౌరసత్వం ప్రస్తావన ఈ నిబంధనకు కీలకమేమి కాదు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా రాజ్యాంగంలోని ఈ నిబంధన పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం ఇ.సి.ఐ కే ఉంటుందని చెప్పడం లేదు. సంవత్సరాల తరబడి అమలవుతూ వచ్చిన పద్ధతి అందుకు పూర్తి భిన్నమైంది. నిర్దిష్టమైన అభ్యంతరాలతో, హోంశాఖ నుంచి తనిఖీలతో మాత్రమే ఓట్ల తొలగింపు జరుగుతూ వచ్చింది. ఈ తనిఖీపై హోంశాఖ పూర్తి సాధికారత కలిగి ఉండేది.

జులై మొదటి వారంలో ప్రతిపక్షాలు ఇ.సి.ఐని కలుసుకొని తమ ఆందోళన తెలియజేశాయి. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పరిస్థితిని చక్కదిద్దడానికి చేసిన ప్రయత్నాలను పట్టించుకోవడానికే ఎన్నికల కమిషన్ నిరాకరించింది. దాంతో ఆ పార్టీలకు చివరి ప్రయత్నంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ రాజ్యాంగ బద్ధతను సవాల్ చేయటానికి సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. అలాగే ముసాయిదా ప్రతి (డి.ఇ.ఆర్) ప్రచురణ తర్వాత ఈ అంశం మరింత తక్షణాంశంగా ముందుకు వచ్చింది. దాన్ని ప్రారంభించడానికి ముందున్న వాటిలో 65 లక్షల ఓట్లు తొలగించబడినట్టు డి.ఇ.ఆర్ చెప్పింది. ఇందులో అధికమైన తొలగింపులు ఓటర్ల మరణం వల్ల లేక ఆచూకీ తెలియక పోవడం వల్ల జరిగినట్టు పేర్కొనబడింది. మామూలు భాషలో చెప్పాలంటే ఇవన్నీ వలస కార్మికులకు ప్రస్తావనలే. ఇప్పుడు మన ముందున్న అతి పెద్ద ప్రశ్న తక్షణ పరిశీలన తర్వాత భారీ సంఖ్యలో తొలగింపులకు సంబంధించిన ఆందోళన. 2025 జనవరిలో జరిగిన ఈ ప్రక్రియ తర్వాత ఏప్రిల్, మేలో జాబితా ప్రకటించబడింది. అది నిజానికి పరిశీలన కానే కాదు. కొత్త తరహాలో సృష్టించబడిన సరికొత్త జాబితా మాత్రమే. సామూహిక తొలగింపు అనే లక్ష్యంతోనే జరిగింది. ఓటర్ల జాబితాలో ఒక్క ఓటు కూడా కొత్తగా చేర్చబడలేదు. దీంతో ఇ.సి.ఐ అసలు ఉద్దేశం నగంగా బయటపడింది. ఈ క్రమంలో కమిషన్ కేవలం 65 లక్షల మంది ఓట్లను తొలగించడమే కాదు అలా తొలగించబడిన వారి పేర్లను అందుకు గల నిర్దిష్ట కారణాలను ప్రచురించడానికి కూడా నిరాకరించింది. ఈ కసరత్తు వక్రబుద్ధి ఏమిటో అర్థమైన తర్వాత సుప్రీంకోర్టు తాత్కాలిక ఉత్తర్వుతో కమిషన్‌ను తొలగించిన వారి పేర్లను అందుకు కారణాలను యాంత్రిక రూపంలో చదువుకునే విధంగా విడుదల చేయాలని ఆదేశించింది. ఆధార్‌ను నివాసానికి సాధికార సాక్ష్యంగా ఆమోదించాలని కూడా ఆదేశించింది. అయినా ఒక తీవ్రమైన సమస్య మిగిలింది. అసలు ఇ.సి.ఐకి పౌరసత్వ నిర్ధారణ ప్రక్రియను ప్రారంభించేందుకు రాజ్యాంగబద్ధంగా అధికారం ఉన్నదా అన్నదే ఆ ప్రశ్న. ఎస్.ఐ.ఆర్ పేరుతో ఎన్నికల కమిషన్ ఎన్.ఆర్.సి (పౌరసత్వ నమోదు చిట్టా)ని తీసుకువచ్చే ప్రయత్నం చేసినట్టు విస్తృతమైన అభిప్రా యం నెలకొన్నది. భారతీయ పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముందుకు తేవాలన్న హిందుత్వ ప్రేరిత నూతన నిర్వచనంతో ఇది ముడిపడి ఉందని స్పష్టంగానే తెలుస్తుంది. రాబోయే ఎన్నికల్లో ఇది కేంద్ర ప్రచార నినాదంగా ఉండబోతుందన్నది.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోట నుంచి చేసిన తన స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో నొక్కిచెప్పారు. చొరబాటుదారులనబడే వారికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన తాజా మత దాడి సారాంశం అదే. ప్రధాన మీడియాలో వచ్చిన సర్వేలు, డేటా అంశాలను చూసినా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ లోలోపలి లక్ష్యం ఏంటో బట్టబయలవుతుంది.

# నల్లమలలో టూరిజం అభివృద్ధి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





మనగలం శ్రీశైలం లెఫ్ట్ బ్రాహ్మగిరి : సోమశిల, అమరగిరి ఐలాండ్, కృష్ణగిరి ప్రాంతాల్లో ' వెల్నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టుకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన అమరగిరి ఐలాండ్ వెల్నెస్ రిట్రీట్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో టూరిజం చైర్మన్ పటేల్ సుధాకర్రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ పర్యాటకులను ఆక ర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నల్లమలలో టూరిజం అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని నల్ల మల ప్రాంతాల్లో పలు అభివనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ మండల పరిధిలోని కృష్ణానది తీర ప్రాంతమైన ఆ మరగిరి ఐలాండ్ లో సోమశిల గ్రామాల్లో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి పర్యాటక అభి వృద్ధిలో భాగంగా రూ.68.10 కోట్ల అంచనా వ్యయంతో వెల్నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టుకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమరగిరి గ్రామంలో నుంచి ఏపీ లాంచీలో అమరగిరి ఐలాండ్కు చేరుకుని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడు తూ... త్వరలోనే తెలంగాణాలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పే ర్కొన్నారు. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరా బాద్కు హెలీ టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు స్ప ష్టం చేశారు. దీని వల్ల తెలంగాణ పర్యాటక రంగం కూడా కొత్త మలుపు తి రుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో రూ.45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్నెస్ రిట్రీట్ నిర్మాణ పను లు రూ.1.60 కోట్లతో సోమశిల వీఐపీ ఘాట్, బోటింగ్ పాయింట్ కోసం ట్రెం చింగ్ పనులకు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మె ల్సీ కూచుకుళ్ల దామోదర్రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు. విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మౌలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించి తద్వారా ఉద్యోగ కల్పనతో పాటు ఆయా ప్రాం తాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయని పేర్కొన్నారు. పర్యాటకులను ఐ లాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాట చేస్తున్నామన్నారు. పర్యాటక అభివృద్ధి సం స్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం పర్యాటక రంగంలో అగ్ర స్థానంలో నిలబెట్టడానికి సీఎం రేవంత్రెడ్డి కృ షి చేస్తున్నారని అన్నారు.




కృష్ణగిరిలో రూ.20కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం నల్లమలను పర్యాటక హబ్గా తీర్చిదిద్దేం దుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నా గర్కర్నూలు జిల్లా పరిధిలోని కృష్ణగిరి(ఈగ లపెంట) వద్ద వెల్నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్టులో భాగంగా రూ.20కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి ప నులకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. రూ.3.60కోట్లతో చెంచు మ్యూజియం పునరుద్ధరణ సివిల్ పనులు, నీటి సదుపా యం, శానిటరీ ఎలక్ట్రికల్ సౌకర్యాల కల్పన, రూ.8.36 కోట్లతో అరైవల్ జోన్ ప్రోమెనెడ్ కృష్ణగిరిలో పర్యాటక అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అభివృద్ధి పనులు. 7.69 కోట్లతో కృష్ణగిరి రివర్ క్రూయిజ్ఫ్రేడ్ రూఫ్టాప్ కేఫే, వ్యూయింగ్ డె క్, నీటి సరఫరా సానిటరీ, ఎలక్ట్రికల్, ల్యాండ్ స్కేప్ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో నల్లమలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. బ్రహ్మగిరి, కృష్ణగిరి ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చేసి స్థానికుల కు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎ మ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, స్థానిక కాంగ్రెస్ నా యకులు చత్రూనాయక్, శ్రీను పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




మనగళం, గూడూరు : గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నాగలాపురం గ్రామ శివార్ల నుండి సుంకులమ్మ దేవాలయం వరకు "వర్షాకాల పరిశుభ్రత" అనే థీమ్ తో నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సుంకులమ్మ దేవాలయం ప్రాంగణంలో మొక్కలు నాటి, అక్కడే ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆగస్టు మాసంలో"వర్షాకాల పరిశుభ్రత థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. వర్షాకాలంలో డ్రెయిన్లు, కుంటలు, గుంతలు, అలాగే వాడి పడేసిన టైర్స్ లో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వీటిని నివారించాల%శీ%టే ఖచ్చితంగా ఎప్పటికప్పుడు నీటిని తొలగించి, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటి నుండి చెత్త సేకరణ, డ్రైన్స్ క్లీన్ చేసుకోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశుభ్రతకు సంబంధించి ఎన్ని కార్యక్రమాలు చేసినప్పటికీ కూడా ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. తమ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు వాటర్ ట్యాంక్ లు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ లో నాగులాపురం గ్రామ పంచాయతీ 80 శాతం ప్రజల నుండి సానుకూల స్పందన పొందినందుకు కలెక్టర్ పంచాయతీ సిబ్బందికి అభినందనలు తెలియచేశారు. గ్రామంలో ఎక్కడైనా సిసి రోడ్లు లేకపోతే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, స్ట్రీట్ లైట్స్ ఎక్కడైనా లేకుంటే వేయించాలని సూచించారు. కలెక్టర్ ముందుగా జెడ్పీహెచ్ఎస్, పెంచికలపాడు విద్యార్థులకు శుభ్రత ఏ విధంగా పాటించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం క్లాప్ మిత్రలకు కలెక్టర్ సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సర్పంచ్ నాయోమి, ఎంపిడిఓ మధులత, తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్యాపిలి పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర

మన గళంప్యాపిలి పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో "స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం భాగంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ బోర్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు భారతి నరసింహారెడ్డి వెంకటేశ్వర్లు ప్రభాకర్ రెడ్డి గారు ప్రభాకర్ రెడ్డి శివకుమార్ గౌడ్ పంచాయతీ సెక్రెటరీ సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లుటిడిపి నాయకులు మండల నాయకులు ఖాజా పీర్ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసులు యువ నాయకులు చల్లా అనుదీప్ కుమార్ సయ్యద్ అక్బర్ వలి తదితరులు పాల్గొన్నారు.




# విఆర్ఎ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

మన గళండోన్ గ్రామ విఆర్ఎ అధ్యక్ష ఉపాధ్యక్షుల ఎన్నిక శని వారం జరిగాయి. అధ్యక్షులు గా శివ శంకర వర ప్రసాద్,ఉపాధ్యక్షులుగా రవి కుమార్, కార్య దర్శిగా మహేశ్వర నాయుడు, సహాయ కార్యదర్శి గా యాపదిన్నె టి.రంగయ్య , కోశాధికారి గా హరికృష్ణ ఎన్నికైయా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వి ఆర్ ఎ ల సమస్యల అమలు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికైన వారికి వి ఆర్ ఎ లు అభినందనలు తెలిపారు



## రైతులకు యూరియా కొరత లేకుండా చూడండి.


అభిరుచి మధు

మనగళం,నంద్యాల నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరతలేకుండా చూసి,రైతులకు అవసరమయ్యే యూరియా తెప్పించాలని మార్క్ ఫెడ్ మేనేజర్ హరినాథ రెడ్డి నీ నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కోరారు. బొమ్మలసత్రం సమీపంలో ఉన్న మార్క్ ఫెడ్ కార్యాలయంలో మేనేజర్ హరినాథ రెడ్డిని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కలిశారు.ఈ సందర్భంగా ఆయనతో యూరియా సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని చెప్పామని అన్నారు.రైతులకు అవసరం అయ్యే యూరియా తెప్పించాలన్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడటం వల్ల రైతులు నెలరోజులు ముందునుంచే పొలాలు దుక్కి దున్నుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో వేస్తున్న పంటల ఆధారంగా ప్రభుత్వం యూరియా పంపిస్తుందని అన్నారు.గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల సరైన సమయంలో యూరియా రాలేదన్నారు. రెండు, మూడు రోజుల్లో రైతులకు అవసరమయ్యే యూరియా అందుబాటులోకి వస్తుందని అన్నారు.ప్రధానంగా రైతులు వారికి అవసరం అయినంత మేరకే యూరియా ఉపయోగించాలని అన్నారు.

## ఉమ్మీద్ పై అవగాహనా సదస్సు




మనగళం, నంద్యాల : నంద్యాలలో వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మీద్ పై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొహమ్మద్ అలీ పాల్గొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో... కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లా పరిధిలోని మస్జీదులు, దర్గాలు, ఆశూరా?నాలు, ఇతర వక్స్ సంస్థల వివరాలను 'ఉమ్మీద్ పోర్టల్' లో ఎంటర్ చేయడం ద్వారా పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా ఉమ్మీద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ అలీ ఉమ్మీద్ పోర్టల్ లో వివరాలను ఎంటర్ చేసే విధానం, దాని ప్రయోజనాలపై ముతవల్లీలకు స్పష్టమైన సూచనలు చేశారు. సంస్థల ఆస్తుల వివరాలు, ఆక్రమణల వివరాలు నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులోనూ రికార్డులు సక్రమంగా ఉండేలా పారదర్శకత సాధ్యమవుతుందిన్నారు. వక్స్ బోర్డు కేవలం 7% ఆదాయం మాత్రమే వక్ఫ్ నిధులుగా సేకరిస్తుందని, మిగిలిన 93% ఆదాయాన్ని వక్స్ డీడ్ల ప్రకారం పేదల సంక్షేమం, విద్యారంగం కోసం వినియోగించాలన్నారు. అయితే అనేక సంస్థలు ఈ నిబంధనను పాటించడం లేదనన్నారు. మైనార్టీ మంత్రి మొహమ్మద్ ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ నిధులను పేదల సంక్షేమం, విద్యా అభివృద్ధి, వక్స్ ఆస్తుల రక్షణకు వినియోగించే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి సయ్యదా సబీహా పర్వీన్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో వక్ఫ్ సంస్థలు ఉన్నాయని, జిల్లా యంత్రాంగం, వక్స్ బోర్డు ప్రధాన కార్యాలయం సహకారంతో వక్స్ ఆస్తులను ఆక్రమణల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ముతవల్లీలు ఈ అవగాహన కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వక్ఫ్ బోర్డు సీఈఓ మొహమ్మద్ అలీ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చైర్మన్ అబ్దుల్ అజీజ్ కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్ షేక్ నసీర్, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్లు షేక్ ఇమ్రాన్, సయ్యద్ సోహైల్, ముక్తార్, మురాద్ అన్సారీ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖుద్దూస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించండి



మనగళం, నంద్యాల: అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, వివిధ శాఖలకు పురోగతికి సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను త్వరితగతిన నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, ఆర్టిజిఎస్ లెన్స్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శాఖల పురోగతి కోసం కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను కేటాయించడం జరిగిందన్నారు. సదరు ఇండికేటర్స్ ఆధారంగా శాఖల పురోగతిపై ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సరైనా వివరాలను అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఆర్టిజిఎస్ లెన్స్ సైట్ లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో సిపిఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి

మనగళం, నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20 నుండి దిగువ కోర్ట్ లలో వివిధ ఉద్యోగాల కొరకు పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరుగుచున్న పరీక్షలను ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి, నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బంది ని ఆదేశించారు.



## అన్నప్రసాద వితరణకు విరాళము



మనగళం శ్రీశైలం : జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిత్యం ఏర్పాటు చేయబడిన అన్నప్రసాద వితరణకు కర్నూలు జిల్లా డోన్ వాస్తవ్యులు 1,00,000 విరాళాన్ని దేవస్థాన సహాయ కార్యనిర్వాహణాధికారి సతీష్ మల్లిక్ పర్యవేక్షకులు పి దేవికకు శుక్రవారం నాడు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు తగు రసీదు ప్రసాదాలు శేష వస్త్రాలు అందజేయడం జరిగింది.

# స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి




– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లాస్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కలుగుతుందన్నారు. రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించాలన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. అదే విధంగా అధిక వర్షాల కారణంగా నీటి నిల్వలు ఉండడం వల్ల డయేరియా ప్రబలకుండా విస్తృత చర్యలు పాటిస్తూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లో విస్తృతంగా శ్రమదానం చేశారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్.... పిచ్చిమొక్కలు, చెత్త వ్యర్థాలను తొలగించారు. అదే విధంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి


– జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్

మనగళం, నంద్యాల : స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డీఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు, మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డీఆర్ఓ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలెట్ ఓటింగ్ బదులుగా ఈవీఎం ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదవడం జరిగిందన్నారు. వాటికి బదులుగా బ్యాలెట్ పేపర్ ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. నంద్యాల నియోజకవర్గం పాండురంగాపురం గ్రామానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఆర్ఓను కోరారు. సమావేశంలో టీడీపీ ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, శివరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, సీపీఐ ప్రతినిధి పి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

మనగళం నెట్ వర్క్ : మంగళగిరి శివాలయం వద్ద గల పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అన్నదాన మహోత్సవం కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల సందడితో పాటు భక్తి కాంతులు వెదజల్లుతూ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు తో పాటు జనసేన నియోజకవర్గ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు స్వయంగా అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఎటువంటి విరామం లేకుండా ప్రతి నెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదారత వల్లే భక్తులకు ఆహారం అందించే అవకాశం లభిస్తోందని అన్నారు. "భక్తుల సేవే పరమార్ధం. ఆకలితో వచ్చే వారు అన్నప్రసాదం స్వీకరించి సంతృప్తిగా వెళ్లడం మాకు ఆనందాన్నిస్తుంది" అని సాంబశివరావు పేర్కొన్నారు. భక్తులు 3000 వేల మందికి పైగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆయన అన్నారు. జనసేన నియోజకవర్గం తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడుతూ కాశీ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అమావాస్య రోజున శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, చాగంటిపాటి దేవవర్ధన్, ఖడ్గ శ్రీనివాసరావు, పందేటి శ్రీను, కళ్ళం శివ సాంబిరెడ్డి, ఆలూరి ఉమామహేశ్వరరావు, ప్రసాద్, భోజన పల్లి తాండవ, చీదేళ్ల వాసు, కోదాడ శ్రీనివాసరావు, చిరుమామిళ్ల రంగారావు, యేల్చూరి వెంకట సుబ్బారామిరెడ్డి, వీర రాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రైనేజీల శుభ్రం, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటి తొలగింపు, దోమలు వృద్ధి చెందకుండా నిర్మూలన చేపట్టాలని సిబ్బందికి సూపరింటెండెంట్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీరాములు, ఇన్చార్జి సి ఎస్ ఆర్ ఎం ఓ డా.వెంకటరమణ, డిప్యూటీ సి ఎస్ ఆర్ ఎం ఓ డా.పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, ఇన్చార్జి ఏఆర్ఎంఓ డా.సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం
24 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# శ్రీశైలం ప్రాజెక్టు లో ఎన్టీఆర్ ఫ్యాన్ ప్రెసిడెంట్ సిరాజ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన





మనగలం: శ్రీశైలం నియోజకవర్గం శ్రీశైలం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పై శాంతియుత నిరసన తెలిపిన శ్రీశైల నియోజకవర్గ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సిరాజ్ వారి మిత్ర బృందంస్త్రీలను గౌరవించే పార్టీ తెలుగుదేశం పార్టీ అందులో ఉంటూ స్త్రీలను అగౌరపరిచే విధంగా మాట్లాడిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనే ఎమ్మెల్యేను తక్షణమే సస్పెండ్ చేయాలి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మీరు బహిరంగ క్షమాపణ చెప్పాలి లేకపోతే రాష్ట్ర కన్వీనర్ల ఆదేశానుసారం మా రాష్ట్ర కన్వీనర్ శేఖర్ చౌదరి గారి ఆదేశాల మేరకు చలో అనంతపురం కార్యక్రమం దిగ్విజయం చేస్తామని చెప్పి మనవి చేసుకుంటున్నాం.



# ఊయల సేవ

మనగళం శ్రీశైలం లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (22.08.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయల సేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు. జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకుగాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (22.08.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేష అభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# పరోక్షసేవగా బయలు వీరభద్రస్వామివారి విశేషపూజ



మనగళం శ్రీశైలం : ఈ రోజు (22.08.2025) మధ్యాహ్నానికి అమావాస్య ఘడియలు రావడంతో శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి దేవస్థానం విశేషపూజలను నిర్వహిస్తున్నది. ఈ సాయంకాలం పూజాదికాలు నిర్వహించబడుతాయి. ప్రతీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది. కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 25 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, గుజరాత్, తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు. కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది. ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వకార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కాగా ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతుంది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించబడుతుంది.

# సాంస్కృతిక కార్యక్రమాలు






మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (22.08.2025) జి. సంధ్య మరియు వారి బృందం, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో మూషికవాహన, శ్రీగిరిశంకరా, జతిస్వరం, నమశ్శివాయతే తదితర గీతాలకు షణ్ముఖ, వైదిత, అక్షిత, పూజ, శ్రేయ, మన్విత, పరిణిత, అవంతిక, వైష్ణవి, భవ్య, మానస తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు

# భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైలం




మనగళం శ్రీశైలం శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం శ్రావణమాసం మాసం చివరివారం కావడంతో స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్త లు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించు కున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి.

# సున్నిపెంట లో ప్రీమియర్ లీగ్




మనగలం : సున్నిపెంట శ్రీశైలం, పాతాళగంగ, లింగాలగట్టు, దోమలపెంట పరిసర ప్రాంత క్రీడాకారులకు శుభవార్త మొదటి బహుమతి =1లక్ష ం ట్రోఫి రెండవ బహుమతి =50 వేలుం ట్రోఫ్ స్థలం. ప్రాజెక్ట్, హైస్కూల్ గ్రౌండ్ నందు నుండిపెంట. ఫ్రాంచైజ్ ఫీజు 15 వేలు ఆసక్తి గల క్రీడాకారులు తమ పేరును నమోదు చేసుకోగలరు. గమనిక. ప్రతి ఫ్రాంచైజ్ కి 13 మంది ప్లెయర్స్ ని మాత్రమే ఇవ్వబడును, ప్రతి ఫ్రాంఛైజ్ ఓనర్ తమకి ఇష్టమైన ప్లేయర్ ని ఎన్నుకునే అవకాశం కలదు. లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లేయర్ ని మాత్రమే ఎన్నుకొనవలెను. ఒకవేళ ఫ్రాంచైజ్ ఓనరే ప్లేయర్ అయితే ఎట్టి పరిస్థితులలోను వారికి ప్లేయర్ ఆప్పన్ వుండదు. ముఖ్య సూచనలు. ఎంపైర్ నిర్ణయమే తుది నిర్ణయం. ప్రతి ఒక్క క్రీడాకారుడు మీరు ఏ ప్రాంచైజీకి సెలెక్ట్ అయ్యారో అదే డ్రస్ కోడ్ తో ఆడాలి. ప్రతి క్రీడాకారుడు బూట్ల ఖచ్చితంగా వేసుకొని ఆడాలి. ప్రతి క్రీడాకారుడు ఖచ్చితంగా అన్ని మ్యాచులకు రావాలి. ప్రతి ఒక్క జట్టు ఖచ్చితంగా అన్ని మ్యాచులు ఆడాలి. ప్లేయర్ కి ఏదైన ఎమర్జెన్సి ఉంటే ముందుగానే మీ కెప్టెన్ లేదా మీ ఓనరికి ముందుగానే సమాచారం ఇవ్వాలి. టీములు సరియైన సమయానికి రానిచో ప్రతి 10 ని. ఒక ఓవర్ చొప్పున కుదించబడును. మ్యాచ్ ప్రారంభానికి 30 ని. ముందే టీములు మైదానంలో వుండాలి. నియమ నిబంధనలు. టాస్ వేసిన వెంటనే మీ ప్లెయింగ్ 11 మరియు మీ నిర్ణయం చెప్పాలి. ఈ టోర్నమెంట్ టెన్నిస్ బాల్ తో నిర్వహించబడును. ఈ టోర్నమెంట్ నందు ప్రతి మ్యాచ్క మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కలదు. 12వ ప్లేయర్ మాత్రమే గ్రౌండ్లోకి రావాలి. ప్రతి మ్యాచ్ 12 ఓవర్స్ నిర్వహించబడును. ప్రతి బౌలర్ పూర్తి కోట 3 ఓవర్స్ మాత్రమే. 6 ఓవర్స్ తర్వాత డ్రింక్స్ బ్రెక్ వుంటుంది. మైదానంలో ప్లేయర్ క్రమశిక్షణను ఉల్లఘించినట్లయితే అతనిపై చర్యలు తీసుకొనబడును. మ్యాచ్ జరిగే సమయంలో వర్షం వలన కాని ఏదేని ఇతర కారణముల వలన కాని మ్యాచ్ నిలిచినచో మరళ మ్యాచ్ ఎక్కడ నిలిచిపోయినదో అక్కడి నుంచే ప్రారంభం అగును రీమ్యాచ్ ఉండదు. క్రీడాకారులు గమనించగలరు. ఆర్గనైజర్స :జబ్బి :9491798485,జగదీశ్ :7893392706,

# సామూహిక వరలక్ష్మీ వ్రతములు



మనగళం శ్రీశైలం : సామూహిక వరలక్ష్మీవ్రతంలో ప్రత్యేకంగా చెంచు గిరిజనులకు అవకాశం, వ్రతంలో పాల్గొన్న 850 మంది చెంచు గిరిజనులు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మొత్తం 1600 మందికి పైగా భక్తులు వ్రతములో పాల్గొన్న వారందరికీ చీర, రవికవస్త్రం అందజేత వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం మరియు అన్న ప్రసాదాల ఏర్పాట్లు ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం శ్రావణ అయిదవ శుక్రవారమైన ఈ రోజు (22.08.2025) ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించింది. గత శ్రావణ మూడవ శుక్రవారం (08,052025) రోజున కూడా ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించబడ్డాయి. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కళ్యాణమండపంలో ఈ వ్రతాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రోజు జరిపించబడిన ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు చెంచు గిరిజన భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని పలు చెంచుగూడాలకు చెందిన 650 మంది చెంచు భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు. అదేవిధంగా దాదాపు 950 పైగా ఇతరులు కూడా ఈ వ్రతాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ సామూహిక వ్రతనిర్వహణలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీయం. శ్రీనివాసరావు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, పలువురు పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి శ్రీ కె. వెంకట శివప్రసాద్, ఐ.టి.డి.ఏ. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పి. నాయక్, పలువురు ఐ.టి.డి.ఏ. సిబ్బంది కూడా ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. కాగా ఈ సామూహిక ఉచిత వ్రతాలలో మొత్తం 1600 మందికి పైగా భక్తులు వరలక్ష్మీ వ్రతాన్ని జరిపించుకున్నారు. కాగా నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలలోని దాదాపు 90 గూడెముల నుంచి సుమారు 650 మంది చెంచు భక్తులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. శ్రీశైలమహాక్షేత్రంలో చేసే ఏ పుణ్యకార్యమైన వెయ్యింతల ఫలితాన్నిస్తుందని పురాణాలు చెబుతున్నాయన్నారు. అనంతరం ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి శ్రీ శ్రీ కె. వెంకట శివప్రసాద్ వారు మట్లాడుతూ దేవస్థానం గిరిజన చెంచు భక్తులను వ్రతాలకు ప్రత్యేకంగా ఆహ్వానించడం పట్ల దేవస్థానానికి ధన్యవాదాలు తెలియజేశారు. మూడు జిల్లాలలోని పలుగూడెముల నుండి గిరిజన చెంచు భక్తులు ఈ వ్రతానికి తొడ్కొని రావడం జరిగిందన్నారు. కాగా భక్తులందరూ వ్రతక్రియను సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా చంద్రవతి కల్యాణమండపంలో ఎల్.ఈ.డి స్క్రీన్లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

## పనితీరు మెరుగుపడకపోతే కఠిన చర్యలు

- ఆస్తి పన్ను మదింపులో పొరపాట్లు జరిగితే ఉపేక్ష ఉండదు
- మొండి బకాయిలను వెంటనే రాబట్టాలి
- రెవెన్యూ సిబ్బందికి కమిషనర్ పి. విశ్వనాథ్ హెచ్చరిక



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : రోజురోజుకు పనితీరు మెరుగుపరుచుకుని, మార్పు కనబడేలా విధులు నిర్వహించాలని కమిషనర్ పి. విశ్వనాథ్ సూచించారు. అలా జరగకపోతే కఠిన చర్యలు తప్పవని, క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ఎక్కడైనా తప్పులు కనబడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌కి ఆదాయం పెంచుకునేందుకు ఆస్తి పన్ను మదింపు కీలకమని, అందులో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో తాను పర్యటించినప్పుడు అవకతవకలు కనబడితే వివరణలు అడగకుండా నేరుగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల లీజుల మొండి బకాయిలను వెంటనే రాబట్టాలని, వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిమాండ్లకు తగ్గట్టు పన్ను వసూళ్లు జరగకపోతే, రెండు మూడు సార్లు నోటీసులు ఇచ్చిన తర్వాత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి ఎఫ్ఆర్‌యస్ వేయడం తప్పనిసరి, ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓలు జునైద్, ఇశ్రాయేలు, వాజిద్, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి పథకంపై వైసీపీ తప్పుడు ప్రచారం


- హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్

మనగళం, కర్నూలు : స్త్రీశక్తి పథకంపై వైసీపీ పూర్తిగా తప్పుడు ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. మంత్రి టి.జి భరత్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు కోటి మందికి పైగా మహిళలు ఈ పథకం వలన లాభం పొందినట్లు తెలిపారు. ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వకలేక వైసీపీ నేతలు సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ వీటిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఇలాంటి వైఖరి వలనే గడిచిన ఎన్నికల్లో వారికి 11 సీట్లు ప్రజలు ఇచ్చారన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతోందన్నారు. ఇప్పటికే 80 శాతం వాగ్దానాలు పూర్తి చేశామని, త్వరలో మరిన్ని అమలుచేస్తామన్నారు. ఇక కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంత్రి టి.జి భరత్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు శాంతమ్మ, షేక్ ఫర్జానా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ప్రతిభ కోచింగ్ సెంటర్ కు ర్యాంకుల ప్రభంజనం



మనగళం, కర్నూలు సిటీ : ఏపీ డీఎస్సీ - 2025 లో కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పెద్దఎత్తున ర్యాంకులు సాధించారు. ఇటీవల నిడుదలైన మెగా శిక్షణ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ తోపాటు అత్యధిక ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి అద్భుత విజయం కైవసం చేసుకున్నారు. ఎన్నెన్నో విజయాలు ప్రతిభకే సొంతంగా మారింది. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు 400పైగా ఉత్తమ ర్యాంకులు సాధించారు. కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు బోధన, డైలీ టెస్ట్, వీక్లీ టెస్ట్స్ మరీ ముఖ్యంగా పరీక్ష విధానాలు ఈ ర్యాంకుల ప్రభంజనానికి కారణం. ఇంతటి అద్భుత విజయాలకు వెంటనే రిజల్స్ తదుపరి పరీక్ష పేపరు సంపూర్ణ విశ్లేషణ ఎంతగానో తోడ్పడ్డాయని ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అరుణాచల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన అభినందన సభలో ఆయన కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అరుణాచల్ రెడ్డి అభినందించారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



మనగళంప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల గుండా భక్తులు ఉత్సాహంగా పాల్గొని భక్తి శ్రద్ధలతో వేడుకను అలంకరించారు. ఈ కార్యక్రమంలో గౌరవనీయులు, డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి శ్రీ కోట్ల సుజాతమ్మ పాల్గొని భక్తుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, "శ్రీకృష్ణుడి జీవితం సత్యం, ధర్మం, న్యాయం, భక్తి మార్గాలకు ప్రతీక. నేటి తరాలకు ఆయన బోధనలు స్ఫూర్తిదాయకం కావాలి" అని సుజాతమ్మ పేర్కొన్నారు. శోభాయాత్రలో స్థానిక మహిళలు, యువతులు ఆనందోత్సాహాలతో కోలాటం ఆడి వేడుకలకు విశేష ఆకర్షణగా నిలిచారు. గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, శ్రీకృష్ణ భజనలతో గాలిని గోపాలుని జయజయధ్వనులతో మార్మోగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సాంస్కృతిక బృందాలు భక్తి గీతాలు ఆలపించగా, పిల్లలు శ్రీకృష్ణుడి వేషధారణలో కనిపించి భక్తుల్ని ఆకట్టుకున్నారు

## రహదారులపై ఆక్రమణల తొలగింపు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న తోపుడు బండ్లు, హోర్డింగులు, బోర్డులు, స్టాల్స్, వాహనాలను తొలగించేందుకు శనివారం ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నగర వీధుల్లో అనధికారికంగా నిలిపి ఉంచిన తోపుడు బండ్ల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, ప్రమాదాల అవకాశం పెరుగుతోందని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యం కోసం, రహదారి భద్రత కోసం ఈ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న తోపుడు బండ్లు, అనధికారిక స్టాళ్లు వెంటనే తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలును స్వచ్ఛంగా, క్రమబద్ధంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమద్రామాయణం భారతీయుల హృదయ స్పందన

- ఒంటెడుదిన్నెలో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



మనగళం, గోనెగండ్ల : శ్రీమద్రామాయణం భారతీయ జీవన విధానంపై చెరగని ముద్రను వేసినదని, నేటికీ భారతీయ జీవన స్థితిగతులను ప్రభావితం చేస్తూనే ఉందని ఇది శ్రీమద్రామాయణం యొక్క గొప్పతనమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం, ఒంటెడుదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు మంగళవారం ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు శనివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపన్యసించారు. మూడు రోజులపాటు సి.తులశమ్మ, డమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి చేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తులందరికీ స్థానిక భక్త సమాజం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఉపేంద్రారెడ్డి, స్థానిక భజన బృందాల సభ్యులు, సత్సంగం సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



మనగళం, కర్నూలు క్రైం : ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకూడని సూచిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేయరాదన్నారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.



## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

మన గళండోన్ పట్టణంలోని ఎం.జే.పి.ఏ.పి. పాఠశాలను డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి శ్రీ కోట్ల సుజాతమ్మ ఈ రోజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సుజాతమ్మ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి, విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల చదువు, వసతి, భోజనం తదితర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు మరింత మెరుగైన భవిష్యత్తు సాధించేందుకు కృషి చేయాలని సుజాతమ్మ ప్రోత్సహించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో పాటు కష్టపడి చదువుకోవడం ద్వారానే విజయాలు సాధ్యమవుతాయని విద్యార్థులకు స్పష్టం చేశారు.






మనగళం, 25/8/2025 న సోమవారం ఉదయం 10 గంటలకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ ప్రోగ్రాంలో భాగంగా మహిళల తో స్థానిక TTD కళ్యాణ మండపం నుండి అంబేత్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించిన నున్నారు. ఈ కార్యక్రమం లో పత్తికొండ శాసనసభ సభ్యులు శ్రీ కే.ఈ.శ్యామ్ కుమార్ గారు పాల్గొననున్నారు.ఈ కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అలాగే కూటమి ముఖ్య నాయకులు,నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం ను జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము.

కార్యక్రమం అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు భోజనం సదుపాయం ఏర్పాటు చేయడంమైంది.

ఇట్లు
ఎమ్మెల్యే గారిక్యాంప్ కార్యాలయం,
పత్తికొండ.

## జీఎన్ఎమ్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన సూపరిండెండెంట్

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు వైద్య కళాశాలలో జరుగుతున్న జనరల్ నర్సింగ్ మిడ్వైఫరి(జీఎన్ఎం) సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు, పరీక్ష నిర్వహణ తీరు, ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమం లో ఆసుపత్రి ఇంచార్జ్ సిఎస్ఆర్ఎంఓ, డా.వెంకటరమణ, జిఎన్ఎమ్ ప్రిన్సిపల్, వినోదిని, తదితరులు పాల్గొన్నారు.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310